సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- 38వ వార్డు గీతాముఖర్జీనగర్, గూడూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


గూడూరులో అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారని, సంక్షేమ పథకాల సారథిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను ఆరా తీశారు. స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు

పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో వినూత్న పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్ది, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి డిజిటల్ విద్యను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు నిధులు కేటాయించారని చెప్పారు. పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ తదితర పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్, సచివాలయ కన్వీనర్లు శేషన్న, ఖాజాబీ పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ దక్కాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని కుమ్మరి వీధి, కోట వీధి ప్రాంతాలల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఎమ్మెల్యే తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు.


సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

పట్టణంలోని తూర్పు బీసీ కాలనీలో రూ.12 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. నాణ్యతగా రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జే.ఆబేలు, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, వక్ఫ బోర్డు డైరెక్టర్ జిలానీ, కౌన్సిలర్లు దస్తగిరి, కలామ్, ఖలీల్, మద్ది, కుమార్, విజయ్, దండు శ్రీను, నందకిషోర్, ప్రతాప్ పాల్గొన్నారు.

పనులను గుర్తించండి


ఉపాధి హామీ పథకం కింద గడ్డి సాగును పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

గడివేముల: ప్రజలకు, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలని నంద్యాల జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో పశువుల కోసం సాగు చేసిన గడ్డిని పరిశీలించారు. గ్రామంలోని ఉపాధి కూలీలతో ముఖాముఖి నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు, కూలీలకు ఉపాధిని కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కూలీల సంఖ్య రోజురోజుకు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో అందరికీ అమోద యోగ్యమైన పనులను వేగంగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ, టీఏలు ప్రసాద్, శంకరయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు

పాణ్యం: గ్రామాల్లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ కేంద్రాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ దస్తగిరి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 20న కొండజుటూరు, అనుపూరు, 21న బలపనూరు, కొత్తూరు, గగ్గటూరు, 23న గోనవరం, కొణిదేడు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆధార్‌కార్డులో ఏమైనా సమస్యలున్నా, కొత్త కార్డులు తీయించుకోవాలన్నా, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఆసుపత్రుల తనిఖీ


లద్దగిరి ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న దృశ్యం

కోడుమూరు : లద్దగిరి, కోడుమూరు ప్రభుత్వాసుపత్రులను గురువారం అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంకును తనిఖీ చేసి టీబీ, కుష్ఠు వ్యాధిగ్రస్తుల రికార్డులను పరిశీలించారు. రెండు ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాండ్రపాడు ఎండీయూ ఆపరేటర్‌కు షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 17వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'ఇంటింటికీ రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం'అనే కథనంపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి స్పందించారు. ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయని ఈ తాండ్రపాడు ఎండీయూ ఆపరేటర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి, క్రమశిక్షణ చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ తాండ్రపాడు ఎండీయూ ఆపరేటర్ బి పురుశరాముడు గత కొంతకాలంగా వాహనంలో రేషన్ పంపిణీ చేయడం లేదని, డీలర్‌షాపులోనే సరుకులు పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు విచారణలో బట్టబయలైంది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కర్నూలు ఆర్డీఓ వెల్లడించారు.

నాడు-నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి

గూడూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంఈఓ సుసీలమ్మ సూచించారు. కె.నాగలాపురంలోని పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నాడు-నేడు కింద 20కి పైగా పాఠశాలలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో పనులను ప్రారంభించారని చెప్పారు. పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా పర్యవేక్షించాలని హెచ్‌ఎంలు, కమిటీ చైర్మన్లకు సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఇతర అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దృష్టి సారించాలన్నారు. గ్రామాలలోని మనబడి నాడు - నేడు రెండవ విడత కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి అంశాలను, పెండింగ్ పనులపై చర్చించి పురోగతి సాధించేలా చూడాలని ఎంఈఓ జ్యోతి, పల్లెలో జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు, ఆయా గ్రామాలలో ప్రజలు నిర్మించుకున్న గృహ నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలని మండల హౌసింగ్ ఏఈ సుమంత్, ఇంజినీర్ అసిస్టెంట్లకు సూచించారు. ఈఓఆర్డీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ఓర్వకల్లు : ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని గుడుంబాయి తండాకు చెందిన పలువురు గిరిజనులు అధికారులను కోరారు. గురువారం తండాకు చెందిన గుండాల్ నాయక్, సక్రునాయక్, ఓబె నాయక్, శంకర్‌నాయక్, రాజేష్‌నాయక్, గోపాల్ నాయక్ తదితరులు డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, గ్రామ సమీపంలో గల సర్వే నంబర్ 876/ఏలో 7.36 ఎకరాలు, సర్వే నెంబర్ 876/బిలో 5.54 ఎకరాల చొప్పున మొత్తం 12.90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. సదరు భూమిని గ్రామ ప్రజల ప్రయోజనాల కోసం కేటాయించినట్లు తెలిపారు. అయితే 60 ఏళ్ల క్రితం ఆ స్థలంలో కుల దేవునికి ఆలయం నిర్మించినట్లు తెలిపారు. రమేష్, మౌలాలిలకు 876/ఏ, 876/బి సర్వే నంబర్‌లో పట్టా ఇవ్వడమేగాక, వారి పేరట ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ఆరోపించారు. ఆక్రమిత భూమిపై విచారణ జరిపించి వారి పట్టాలను తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వ తోడ్పాటు


సి.బెళగల్‌లో మహిళలకు పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప, అధికారులు

సి.బెళగల్: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని, ప్రభుత్వ సహకారంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలో వైకేపీ సిబ్బంది మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వారు మండల అధికారులతో కలిసి లబ్ధిదారులకు పెరటికోళ్లను పంపిణీ చేశారు. మండలానికి మొదటి విడతలో నవంబర్ నెలలో 37 పెరటికోళ్ల యూనిట్లు మంజూరవ్వగా, రెండవ విడతలో గురువారం 80 యూనిట్లు పంపిణీ చేయడం జరిగిందని కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ రాముడు తెలిపారు. కాగా ఒక్కో యూనిట్ ధర రూ.3,150 ఉందని, ఒక్కో యూనిట్‌లో గుడ్ల పెట్టే ఎనిమిది పెట్టె కోళ్లు, మూడు పుంజులతో పాటు మూడు రకాల మందులను అందజేయడం జరుగుతుందని వైకేపీ సీసీలు రాముడు, మారెన్నలు వెల్లడించారు. కార్యక్రమంలో కొత్తకోట సర్పంచ్ శ్రీనివాసులు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సుజన, ఎంస్ అకౌంటెంట్ గోవిందు, వైసీపీ నాయకులు ఆనందం, సూర్యచంద్ర, వైకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కర్నూలు నగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ రగ్బీ పోటీలకు తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయమ్మ తెలిపారు. గురువారం ఆదర్శ విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా జట్టు తుది ఎంపికలో తమ పాఠశాలకు చెందిన బాలికలు బాలప్రియదర్శిని, ఆదిలక్ష్మి, బాలుర జట్టులో సోహెల్‌కు స్థానం దక్కిందని వెల్లడించారు. స్టాండ్ బైగా పాఠశాలకు చెందిన చెన్నకేశవ ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి, జిల్లా జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మహమ్మద్ బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణరెడ్డి

కోడుమూరు : సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణరెడ్డి ఆదేశించారు. కోడుమూరు మండలంలోని పులకుర్తి, కల్లపరి సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. అయుష్మాన్ భారత్ కింద జరుగుతున్న ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. బియ్యం కార్డులు, జగనన్న తోడు లబ్ధిదారులకు ఈ-కేవైసీ చేయించాలని సూచించారు. ప్రతి సచివాలయంలో రోజూ 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కల్యాణమస్తు కార్యక్రమంపై ప్రజలకు సమాచారం ఇవ్వాలని వాలంటీర్‌లకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓటీఎస్.. లబ్ధిదారులకు వరం


లబ్ధిదారులకు రుణ విముక్తి పత్రం అందిస్తున్న సర్పంచ్ మద్దిలేటి

కల్లూరు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓటీఎస్ స్కీము లబ్ధిదారులకు వరమని కె.మార్కపురం సర్పంచ్ మద్దిలేటి అన్నారు. గురువారం కె.మార్కపురం, పెద్ద కొట్టాల గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గృహ రుణ విముక్తి పత్రాలు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నాయకత్వంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా 1983-2011 మధ్య కాలంలో హౌసింగ్ శాఖలో రుణం తీసుకొని గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, వీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించండి
- సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా వివిధ శాఖలకు చెందిన అధికారులు గత మూడు నెలల ప్రగతి నివేదికలతో పాటు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను వివరించారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద మండలంలో కొత్తగా 284 మందికి పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. పాత వాటిలో 140 మందికి సంబంధించిన పింఛన్లపై విచారణ జరుపగా అందులో కేవలం 12 మంది పింఛన్లు మాత్రం వేర్వేరు కారణాలతో తొలగించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, సాధికార సర్వే ఆధారంగా కుటుంబంలో కూతురు ఉద్యోగస్తురాలైతే, ఆమె ఎలాగు అత్తారింటికి వెళ్లుతుంది కాబట్టి సదరు కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించుకోవచ్చని చెప్పినట్లు తెలిపారు. ఒకవేళ కుటుంబంలో కొడుకులు ఉద్యోగస్తులతే మాత్రం రేషన్ కార్డు నుంచి వారి పేర్లను తొలగించి ఆ కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించే వెసలుబాటు కల్పించినట్లు వెల్లడించారు. తొలగించిన పింఛన్‌దారుల దరఖాస్తులను పునఃపరిశీలించి అలాంటి వారికి కూడా సాధ్యమైన వరకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

నెలాఖరుకు రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీ

మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంతో పాటు, నన్నూరు, హుసేనాపురం, కాల్వ, బ్రాహ్మణపల్లె, ఉయ్యాలవాడ, శకునాల తదితర గ్రామాలలో రెండో విడత జగనన్న హౌసింగ్ కాలనీలలో మంజూరైన ఇళ్ల పట్టాలను ఈ నెలాఖరు నాటికి పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామాల్లోని సమస్యలపై పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. విద్యుత్ ఏఈ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, ఎంపీపీ తిప్పన్న, డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్గాలకు, పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డులోని వాసవీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని వార్డులోని ప్రతి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడున్నరేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశామని చెప్పారు. కరోనా పరిస్థితులు ఉన్నపటికి రాష్ట్రంలో పేదలు ఇబ్బందులు పడకుదని సంక్షేమ పథకాలను అందించమని చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం అందిస్తున్న పాలనకు తేడాను గమనించాలన్నారు. అవినీతి రహితంగా పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయ్యే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, వైజా అరుణ, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వార్డు ఇన్‌చార్జ్‌లు శ్రీధర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, నాయకులు పెద్దయ్య, పుల్లారెడ్డి, వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

గూడూరు రూరల్ : మండలంలోని ఎంపిక చేసిన సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. మల్లాపురంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసి కార్డు మంజూరు చేయడం, 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి చిరునామా, పేరు మార్పులు, చేర్పులు తదితర వాటిని చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు కొరకు ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

44443.69 ఎకరాల్లో భూముల రీ సర్వే


జి శింగవరంలో రైతుల నుంచి భూముల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని గ్రామాల్లో గురువారం నాటికి 44443.69 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తి చేశామని కర్నూలు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేపై ఎప్పటికప్పుడు వీఆర్ఓలు, గ్రామ సర్వే సహాయకులతో సమీక్షిస్తున్నామని తెలిపారు. రైతులకు ముందస్తుగానే గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం అందిస్తున్నామని చెప్పారు. రైతులు తమ పొలాల వద్ద ఉండి వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఓర్వకల్లు : విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం నన్నూరు సమీపంలోని 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో యూనియన్ 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు టీజే తిరుమలయ్య, బీఎస్ గణేష్, రాష్ట్ర నాయకులు ఉసేనయ్య, ఉసేని పాల్గొన్నారు.

చెరువులు నిండుగా.. పంటలు పచ్చగా

- లిఫ్ట్ ఇరిగేషన్‌తో చెరువులకు సమృద్ధిగా నీరు
- అదనపు మోటార్ల ఏర్పాటుతో రెండు కార్లకూ నీరు
- మంచాలకట్ట చెరువు కింద రెండు వేల ఎకరాలు సస్యశ్యామలం
- ఆనందంలో అన్నదాతలు


నీటితో కళకళలాడుతున్న మంచాలకట్ట చెరువు



ఆయకట్టు కింద పచ్చగా ఉన్న పంట

గడివేముల: ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద 2014 సంవత్సరంలో మంచాలకట్ట చెరువుకు ఎస్ఆర్‌బీసీ కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులోకి నీటిని పంపింగ్ చేయడం ప్రారంభించారు. అయితే ప్రారంభమైన కొన్ని రోజులకే మోటార్లు కాలిపోవడం, ఎవరూ పట్టించుకోకపోవడంతో పథకం మరుగున పడింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆయకట్టు రైతులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకుపోగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించడంతో పాటు అదనంగా మోటర్లు ఏర్పాటు చేయించారు. దీంతో రెండు సీజన్లకు నీరు సమృద్ధిగా అందుతుండటంతో పంటలు కళకళలాడుతున్నాయి.

జనవరిలోనూ చెరువు కళకళ

మంచాలకట్ట చెరువు కింద రెండువేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఇందులో తలముడిపి గ్రామానికి 1,200 ఎకరాలు, మంచాలకట్టకు 800 ఎకరాలలో 454 మంది ఆయకట్టు రైతులు ఉన్నారు. జనవరి మాసం పూర్తవుతున్న మంచాలకట్ట చెరువు నీటితో కళకళలాడుతోంది. దీంతో రెండో పంటకు సాగునీరు భయంలేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వరి, మినుము, మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేశారు. ఆయకట్టు కింద ఉండే పంటపొలాలు మంచి దిగుబడులు వస్తున్నాయని అన్నదాతలఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



మంచాలకట్ట చెరువుకు గతంలో ఎన్నడూ లేని విధంగా లిఫ్ట్‌ఇరిగేషన్‌ను ఏర్పాటు చేయించి, అదనంగా మరో రెండు మోటర్లు ఏర్పాటు చేసినందుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి రుణపడి ఉంటాం. రెండు కార్లకు సాగునీరు సమృద్ధిగా అందించడంతో మా పంటలు బాగా ఉన్నాయి. చెరువు కింద సాగు చేసిన పంటలు బాగా ఉండటంతో ఆదాయం బాగా వస్తుందని ఆశిస్తున్నాం. **–చాకలి తిరుపాలు, రైతు, మంచాలకట్ట**

రైతులకు ఇబ్బంది లేకుండా నీరు అందిస్తున్నాం

మంచాలకట్ట చెరువు కింద సాగు చేసిన పంటలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తున్నాం. లిఫ్ట్ ఇరిగేషన్‌లో ఉన్న మోటార్లు బాగా పనిచేస్తున్నాయి. తూములకు నీరు అందనప్పుడు మోటార్లను ప్రారంభిస్తాం. మోటార్ల మరమ్మతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిధులు ఉన్నాయి. ఈ సంవత్సరం నుంచి ఆయకట్టు రైతులు రెండు సీజన్లకు సాగునీరు అందిస్తాం. **–కేశవయ్య, డీఈ, ఇరిగేషన్**